

విశేష హోమం

సింహాచలం: శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహాచలం కొండదిగువ వెంకన్న గుడిలో బుధవారం హోమం నిర్వహించారు.



శ్రీవారి శాంతి కల్యాణం

విశాఖ: పీలానగర్ ఎస్టీబీఎల్‌లోని బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం జరిగింది.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 39.3/29.5

వాతావరణం పొడిగా ఉంటుందని, గరిష్ట ఉష్ణోగ్రతలు 2–4 డిగ్రీలు క్రమంగా పెరిగే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి బుధవారం తెలిపారు.

న్యూస్‌రీల్

అప్పన్న హుండీ ఆదాయం రూ.3.56 కోట్లు

28 రోజులకు రికార్డు స్థాయిలో ఆదాయం



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం లభించింది. గత 28 రోజులకుగాను రూ.3 కోట్ల 56 లక్షల 22వేల 149 వచ్చినట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. దేవస్థానం చరిత్రలో 28 రోజుల్లో ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం రావడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. నగదుతో పాటు 142.100 గ్రాముల బంగారం, 28.440 కిలోల వెండి లభించినట్టు తెలిపారు. రోజుకు సరాసరి రూ.12 లక్షల 28వేల 350 హుండీ ఆదాయం లభించిందన్నారు. హుండీల ఆదాయాన్ని మంగళ, బుధవారాల్లో లెక్కించారు.

71 గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు



చౌడువాడ శాఖా గ్రంథాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కార్యదర్శి వెంకటరావు

కె.కోటపాడు: వేసవి సెలవుల్లో విద్యార్థులకు శాఖా గ్రంథాలయాల ద్వారా వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్.వెంకటరావు తెలిపారు. చౌడువాడ శాఖా గ్రంథాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెల 15 నుండి ఉమ్మడి విశాఖ జిల్లాలో గల 71 శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జూన్ 8 వరకూ ఈ కార్యక్రమాలను ప్రతి రోజూ జరపనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు నీతి కథలను చదవించడం, స్పోకెన్ ఇంగ్లీష్, వ్యాసరచన, డిబేట్, క్రీడలు, దేశ నాయకుల గురించి వివరించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సంస్థ కార్యదర్శి వెంకటరావు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు ముగింపు రోజున సర్టిఫికెట్లు ఇస్తామని తెలిపారు. శాఖా గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్



విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న సిబ్బంది

తుమ్మపాల: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (రేబాక)లో పాలిసెట్-2024 కౌన్సెలింగ్ మూడో రోజు బుధవారం కొనసాగింది. 27,001 నుంచి 43,000 వరకు ర్యాంక్ కలిగిన విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలను సమర్పించి ఐసీఆర్ పత్రాలు స్వీకరించారు. మొత్తం 167 మందిలో 51 మంది బాలికలు, 116 మంది బాలురు కౌన్సెలింగ్‌కు హాజరైనట్టు పాలిసెట్ కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం 43,000 నుంచి 59 వేల ర్యాంకు వరకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.

బాలికల గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు



తాళ్లపాలెంలోని బాలికల గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఉభయ జిల్లాల సమన్వయకర్త రూపావతి

కశింకోట: ఉభయ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని బాలికల గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 108 మిగులు సీట్లను భర్తీ చేశారు. తాళ్లపాలెంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి బుధవారం ఇక్కడ కౌన్సెలింగ్ నిర్వహించారు. తాళ్లపాలెం, కోనాం, కొక్కిరాపల్లి, నక్కపల్లి, నర్సీపట్నం, మధురవాడ, మేఘాద్రిగెడ్డ గురుకులాల్లో ప్రవేశానికిగాను మిగులు సీట్ల భర్తీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయ జిల్లాల సమన్వయకర్త ఎస్.రూపావతి, ప్రిన్సిపాళ్లు గ్రేస్, మళ్ల మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

దారి చూపుతున్న ట్యాబ్

ఈ అంధ విద్యార్థి పేరు ఎం.రాకేష్‌బాబు. రావికమతం మండలం కొత్తకోట గ్రామం. స్థానిక భవిత కేంద్రంలో 7వ తరగతి చదువుతున్నాడు. ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లతో గూగుల్ లుక్ అవుట్ ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లు పంపిణీ చేయడం తనకెంతో ఉపకరించిందని చెబుతున్నాడు. గతంలో తాను ఎక్కడికైనా వెళ్లాలంటే స్టిక్ పట్టుకొని మరొకరి సహాయంతో వెళ్లేవాడినని, ఇప్పుడు ఈ ట్యాబ్ సహాయంతో తన ముందు ఏముందో ఇట్టే తెలుసుకోగలుగుతున్నానని తెలిపాడు. ట్యాబ్ ఆన్ చేస్తే చాలు అక్కడ ఏయే వస్తువులు ఉన్నాయో, ఎంత దూరంలో ఉన్నాయో వాయిస్ రూపంలో తనకు వినిపిస్తుందని వివరించాడు. తర్ఫీదు తీసుకున్నాక తమ బాబు ఇప్పుడు కళ్లున్నవారిలాగే చుట్టూ ఏముందో తెలుసుకోగలుగుతున్నాడని, చకచకా నడుస్తున్నాడని అతని తల్లిదండ్రులు ఆనందబాష్పాలు రాలుస్తూ చెప్పారు. ఇదంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చలవేనని, ఇలాంటి రోజు వస్తుందని కలలో కూడా ఊహించలేదన్నారు.



ట్యాబ్‌లోని గూగుల్ లుక్అవుట్ యాప్ సహాయంతో తన ఎదురుగా ఉన్న వస్తువులను తెలుసుకుంటున్న రాకేష్‌బాబు

భవిత కేంద్రంలో చదువు.. స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం



ఈ యువకుడి పేరు బొండా చందు. పరవాడ మండలం స్వయంభూవరం గ్రామానికి చెందిన ఇతనికి పుట్టినప్పటి నుంచి వినికిడి లోపం ఉండేది. పరవాడ భవిత కేంద్రంలోని ప్రత్యేక ఉపాధ్యాయులు అతనిని గుర్తించి జాయిన్ చేసుకుని వినికిడి మిషన్ అందించారు. దాంతో టీచర్లు చెప్పే పాఠాలు వినబడేవి. ఆటపాటలతో అక్కడ చదువు బాగా నేర్పించారు. 2019లో పది పాసైన చందు ఐటీఐ చేసి ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్‌లో ట్రెయినీగా పనిచేస్తున్నాడు. ఉపాధ్యాయులు కుమారి, శ్రీనివాసులు తనను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారని చెప్పారు.

ఉజ్వల భవిత

- ప్రత్యేక అవసరాల బాలల్లో మానసిక వికాసం
- ఆటపాటలతో విద్యాబోధన.. ఫిజియో థెరపీ
- డిజిటల్ విద్యను ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్
- అంధ, బధిర విద్యార్థులకు ఎంతో ఉపయోగం
- గ్రామాల్లో ముమ్మరంగా దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వే



దివ్యాంగుల సేవలో రావికమతం భవిత కేంద్రం

రావికమతం: అందరిలా తమ పిల్లలూ ఎదగాలని, చదువుకోవాలని ఆశ పడుతుంటారు.. బిడ్డ వైకల్యంతో అది సాధ్యం కాక మానసికంగా కుంగిపోతుంటారు. ప్రత్యేక అవసరాలు గల బాలల తల్లిదండ్రుల వేదన మాటల్లో వివరించలేనిది. కానీ అది ఒకప్పటి మాట. అటువంటి పిల్లల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రం ఇప్పుడు వారి పాలిట కల్పతరువుగా మారింది. ప్రత్యేక తర్ఫీదు పొందిన ఉపాధ్యాయులు వారికి ఆట పాటలతో కూడిన విద్యా బోధన చేస్తున్నారు. వైద్య నిపుణులు ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీ అందిస్తున్నారు. జిల్లాలో భవిత కేంద్రాలు 24 ఉన్నాయి. వీటి వల్ల 1,485 మంది పిల్లలు లబ్ధి పొందుతున్నారు. ప్రతి కేంద్రంలో ఇద్దరు ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ రిసోర్స్‌పర్సన్లు (ఐఈఆర్‌పీ), ఒక ఆయా ఉంటారు. అవసరమైన విద్యార్థులకు వీల్ చెయిర్లు, వినికిడి, దృష్టిలోపం ఉన్న వారికి ట్యాబ్‌లు అందిస్తున్నారు. వైకల్య శాతం అధికంగా ఉన్నవారికి సదరం సర్టిఫికెట్లు అందించి, పింఛన్ వచ్చేలా చూస్తున్నారు. 9, 10 చదివే విద్యార్థులకు ఏడాదికి రూ.9 వేల నుంచి రూ.14 వేల వరకు ఉపకార వేతనం అందిస్తున్నారు. బస్సు, రైలు పాస్‌లను ఇప్పిస్తున్నారు. పదో తర గతి తర్వాత పాలిటెక్నిక్, డిగ్రీ చదివే దివ్యాంగ వి ద్యార్థులకు ఈ ఏడాది ప్రభుత్వం ల్యాప్‌టాప్‌లు కూడా అందించింది.

ఫిజియో థెరపీతో మంచి ఫలితాలు

భవిత కేంద్రాల్లోని విద్యార్థులకు పాఠశాల విద్యతో పాటు శారీరక అవసరాలను బట్టి వారానికి ఒక రోజు ఫిజియో థెరపీ అందిస్తున్నారు. చెముడు, మూగ, పోలియో, దృష్టిలోపం, నరాల బలహీనత ఉన్న పిల్లలకు వారి రుగ్మతలను బట్టి నిపుణులు థెరపీ అందించడం వలన శారీరక మార్పులు జరిగి సాధారణ విద్యార్థుల్లా అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు.

ప్రత్యేక డిజిటల్ బోధన

దివ్యాంగ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి ప్రత్యేక డిజిటల్ విద్యా బోధనకు శ్రీకారం చుట్టారు. సాంకేతికంగా తీర్చిదిద్దిన యాప్‌లతో కూడిన ట్యాబ్‌లను 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అందించారు. వినికిడి, దృష్టిలోపం ఉన్న పిల్లలకు సైతం బోధన చేసేలా డిజైన్ చేసిన యాప్‌లతో కూడిన ట్యాబ్‌లను అందించారు.

ముమ్మరంగా ఇంటింటి సర్వే

గత ఏడాది జిల్లాలో ఉన్న 1485మంది ప్రత్యేక అవసరాలు గల బాలల కోసం ప్రభుత్వం రూ.37,86,000 వెచ్చించింది. గ్రామాల్లో ఇంకా ఉన్న దివ్యాంగ పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేర్చేందుకు జిల్లా వ్యాప్తంగా ఐఈఆర్‌పీలు ఈ నెల 1వ తేదీ నుంచి ఇంటింటి సర్వే చేస్తున్నారు. జూన్ తొమ్మిది వరకు ఈ సర్వే చేస్తారు. జిల్లా సమగ్ర శిక్ష అధికారులు ఈ సర్వేను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 342 మందిని గుర్తించారు.



భవిత కేంద్రంలో విద్యార్థికి ఫిజియో థెరపీ



రాంబిల్లి మండలం కొత్తపట్నంలో ఇంటింటి సర్వే చేస్తున్న సిబ్బంది



పదో తరగతిలో ప్రతిభ చూపిన దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌టాప్ అందిస్తున్న అధికారులు

దివ్యాంగ బాలల్లో మార్పు



ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఏ గ్రామంలో జన్మించినా ఎక్కడ ఉన్నా ఏటా ఇంటింటి సర్వే ద్వారా వారిని గుర్తించి భవిత కేంద్రంలో చేరుస్తాము. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో ఇప్పటికి 342 మందిని గుర్తించాము. భవిత కేంద్రంలో బోధన ద్వారా, థెరపీ ద్వారా వారి ప్రవర్తనలో మార్పులు తెస్తున్నాం. తల్లిదండ్రులకు సైతం శిక్షణ ఇస్తున్నాం. పిల్లల పురోగతితో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

–బి.శకుంతల,
సహిత విద్య జిల్లా సమన్వయకర్త

అందరిలాగే ఎదుగుతూ..



ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్రవ్యాప్తంగా దృష్టిలోపం, వినికిడి లోపం కలిగిన 4,406 మందికి లుక్అవుట్, ట్రాన్స్‌స్క్రైబ్ యాప్‌లతో ట్యాబ్‌లు అందించింది. దృష్టిలోపం ఉన్న విద్యార్థి ఆ యాప్‌లో కెమెరా ఆన్ చేస్తే ఎదురుగా ఏయే వస్తువులున్నవీ వాయిస్ రూపంలో వినిపిస్తుంది. వినికిడి లోపం ఉన్న విద్యార్థికి ఉపాధ్యాయుడు చెప్పిన పాఠం టెక్స్ట్ రూపంలో కనిపిస్తుంది. ఈ యాప్‌లున్న ట్యాబ్‌ల ద్వారా ఆ విద్యార్థులు అందరిలాగే వారి పనులు వారు సులువుగా చేసుకోగలుగుతున్నారు. మంచి మార్పు ఇది.

–బి.మహాలక్ష్మినాయుడు,
రాష్ట్ర కీ రిసోర్స్‌పర్సన్

పారదర్శకంగా ఓట్ల లెక్కింపు

- ప్రతి అంశంపైనా సంపూర్ణ అవగాహన
- తప్పులు దొర్లకుండా కౌంటింగ్ పక్కాగా సాగాలి
- శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి

సాక్షి, అనకాపల్లి: ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించాలని, అందుకు అధికారులందరూ సమాయత్తం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సిబ్బంది ప్రతి అంశంపైనా క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలని, సందేహాలుంటే శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన శిక్షణ సదస్సులో కలెక్టర్ పలు అంశాలపై సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు విధానంలో అనుసరించాల్సిన విధి విధానాలపై మార్గనిర్దేశం చేశారు. కౌంటింగ్‌కు 5 రోజులే గడువు ఉందని, అన్ని అంశాలపై పట్టు సాధించాలని చెప్పారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లకు లెక్కింపు ప్రక్రియ గురించి, ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అక్కడ అనుసరించే విధానాలు, సంప్రదాయాల గురించి సూక్ష్మంగా వివరించాలని చెప్పారు. ఎలాంటి ఘర్షణ వాతావరణం చోటు చేసుకోకుండా ఆర్వోలు అప్రమత్తంగా ఉండాలని, సమయస్ఫూర్తితో వ్యవహరించి పరిస్థితిని చక్కదిద్దాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ అంతా పూర్తి పారదర్శక విధానంలో, పూర్తి స్థాయి పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎంఎస్ లెక్కింపు సమయంలో జాగ్రత్తగా ఉండాలని, చిన్నపాటి తప్పిదాలు కూడా జరగకుండా అప్రమత్తంగా ఉంటూ ప్రక్రియను నిర్వహించాలన్నారు. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్ల లెక్కింపులో అనుసరించాల్సిన విధానాలను, పద్ధతులను క్షుణ్ణంగా వివరించారు. నివేదికల తయారీలో, ఫలితాల వెల్లడిలో అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. అధికారుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు, ఏఆర్వోలు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్లు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

స్కూళ్లు తెరిచే నాటికి విద్యాకానుక సిద్ధం

- సక్రమంగా పాఠ్య పుస్తకాల పంపిణీ
- డీఈవో వెంకటలక్ష్మమ్మ
- నక్కపల్లి స్టాక్ పాయింట్ తనిఖీ



నక్కపల్లిలో స్టాక్‌పాయింట్ తనిఖీ చేస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

నక్కపల్లి: వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం నాటికి జగనన్న విద్యాకానుక, పాఠ్యపుస్తకాలు సిద్ధం చేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ తెలిపారు. బుధవారం ఆమె నక్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్టాక్‌పాయింట్‌ను తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎన్ని పుస్తకాలు రావాలి, ఎన్ని పుస్తకాలు వచ్చాయనే వివరాలను ఎంఈవో కుంచం నరేష్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు 29,655 పుస్తకాలకు గాను 15,404 పుస్తకాలు (52 శాతం).. 8 నుంచి 10వ తరగతి వరకు 31,115 పుస్తకాలకు 22,148 (72 శాతం) వచ్చాయని ఎంఈవో తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు పంపిణీ చేసే విద్యాకానుకకు బ్యాగులు, షూస్, పుస్తకాలను సిద్ధం చేస్తున్నామన్నారు. పుస్తకాల పంపిణీ పారదర్శకంగా జరగాలన్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని మండలాలకు పాఠ్యపుస్తకాల సరఫరా జరుగుతోందన్నారు. జిల్లాకు వచ్చిన పుస్తకాలను వెనువెంటనే మండల కేంద్రాలకు పంపిస్తున్నామన్నారు. పదో తరగతి సిలబస్ మారిన నేపథ్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పాఠశాలలు తెరిచేనాటికి మౌలిక వసతుల కల్పన, విద్యుదీకరణ పనులు పూర్తిచేయాలని సూచించారు. నాడు నేడు పనుల్లో జాప్యాన్ని సహించేది లేదన్నారు. ఆమె వెంట డీవైఈవో అప్పారావు ఉన్నారు.

మండుతున్న ఎండలు



మండే ఎండలో యువతుల అవస్థ

- మళ్లీ అధిక ఉష్ణోగ్రతలు
- చోడవరంలో 42 డిగ్రీలు

అనకాపల్లి: జిల్లా ప్రజలు అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నారు. బుధవారం చోడవరంలో 42 డిగ్రీలు, అనకాపల్లిలో 39.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదయింది. వర్షాల వల్ల రెండు మూడు రోజులు చల్లబడిన వాతావరణం ఈనెల 26 నుంచి మళ్లీ వేడెక్కింది. అనకాపల్లిలో ఈనెల 26న 36.3 డిగ్రీలు, 27న 37.0, 28న 38.0, 29న 39.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి భానుడు ప్రతాపం చూపడంతో చిన్నారులు, వృద్ధులు ఇళ్లకే పరిమితమవుతున్నారు. సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. రహదారులపై చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వారు అధిక ఉష్ణోగ్రతలకు భయపడి సాయంత్రం వేళ దుకాణాలు తెరుస్తున్నారు. రానున్న రెండు, మూడు రోజులు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు చెబున్నారు.



నిర్మానుష్యంగా అనకాపల్లి రావుగోపాలరావు రహదారి

లక్ష పెండింగ్ కార్డులకు మోక్షం!

- ఇప్పటికే 60 వేల డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డుల జారీ
- త్వరలో మరో 40 వేల పంపిణీకి సన్నాహాలు
- ఇకపై అందుబాటులోకి డిజి లాక్ సదుపాయం
- దీంతో ప్రస్తుత కార్డులకు మంగళం

సాక్షి, విశాఖపట్నం : చాన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీ (రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్) కార్డులకు మోక్షం కలుగుతోంది. కొన్నాళ్ల నుంచి చిప్‌తో కూడిన స్మార్ట్ కార్డుల జారీ ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. 2022 ఆగస్టు నుంచి కార్డుల కొరతతో వీటి జారీ నిలిచిపోయింది. ఇలా విశాఖపట్నం జిల్లాలో 2022 ఆగస్టుకు ముందు వరకు జారీ చేయాల్సిన కార్డులు దాదాపు లక్ష వరకు పెండింగ్‌లో ఉన్నాయి. పాత వాటికి కొత్తగా ఇస్తున్న ఈ స్మార్ట్ కార్డులను ఇప్పటిదాకా 60 వేల వరకు సంబంధిత వ్యక్తులకు/వాహన యజమానుల చిరునామాకు పోస్టల్ ద్వారా పంపించారు. మిగిలిన 40 వేల కార్డులను కూడా పంపిణీ చేయడానికి రవాణా శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఇన్నాళ్లూ ఈ కార్డుల కోసం ఎదురు చూస్తున్న వారికి ఊరట కలుగుతోంది. మరోవైపు నేషనల్ ఇన్ఫర్మేటివ్ సెంటర్ (ఎన్ఐసీ) వాహనాల ఆర్సీల కోసం వాహన్ డాట్ పరివాహన్ డాట్ జీవోవీ డాట్ ఇన్, డ్రైవింగ్ లైసెన్సుల జారీకి సారథి డాట్ పరివాహన్ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచింది. ఇకపై నేరుగా సంబంధిత వెబ్‌సైట్‌లోకి వెళ్లి అవసరమైన డ్రైవింగ్ లైసెన్స్/ఆర్సీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలు కల్పించింది.

దీని వల్ల మునుపటిలా రవాణా శాఖ కార్యాలయాల చుట్టూ పదే పదే తిరగాల్సిన అవసరం ఉండదన్న మాట! పైగా అన్నీ సవ్యంగా ఉంటే నిర్ణీత సమయంలోనే ఇవి జారీ అవుతాయి. వీటికి డిజి లాక్ సదుపాయం ఉంటుంది. ఫలితంగా ప్రస్తుతం ఉన్న, ఇస్తున్న కార్డుల స్థానంలో పీడీఎఫ్ కార్డులు జారీ అవుతాయి. అంతేకాదు.. దరఖాస్తుదారుడు పేపర్ పీడీఎఫ్, స్మార్ట్ కార్డులు రెండూ పొందవచ్చు. లేదంటే ఏది కావాలంటే దానినే తీసుకోవచ్చు. ప్రస్తుతం ఈ-ప్రగతిలో పాత లైసెన్స్/ఆర్సీల వివరాలు తెలుసుకునేందుకు కేవలం రవాణా శాఖ సిబ్బందికి మాత్రమే అవకాశం ఉంది. ఇలా వాహనదారులు, డ్రైవర్లకు అనువైన సదుపాయాలు పొందే వీలు కలుగుతోంది.



డ్రైవింగ్ లైసెన్స్ స్మార్ట్ కార్డులు

బీ ఫార్మసీ పరీక్ష ఫలితాల విడుదల

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో బీ ఫార్మసీ ఐదో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను బుధవారం విడుదల చేశారు. మార్చి నెలలో జరిగిన ఐదో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను వెబ్‌సైట్‌లో ఉంచారు.

31న ఏపీజీఈఏ రౌండ్ టేబుల్ సమావేశం

మద్దిలపాలెం (విశాఖ): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31న విశాఖలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ కె.ఆర్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరగనుందన్నారు. జిల్లా పరిషత్ ఎదురుగా రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ పక్కన గల విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఆ రోజు సాయంత్రం 4 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ప్రధానంగా సీపీఎస్, జీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ, 12వ పీఆర్సీ సత్వర అమలు, డీఏల చెల్లింపు తదితర అంశాలు చర్చిస్తామన్నారు.

చిననందిపల్లి దేవస్థానం భూముల కౌలుకు వేలం

దేవరాపల్లి: మండలంలోని చిననందిపల్లి ఉమా నీలకంఠేశ్వరస్వామి వారి దేవస్థాన భూముల కౌలు సాగుకు వచ్చే నెల 3న టెండర్, బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవదాయ ధర్మాదాయ శాఖ ఈవో శర్మ బుధవారం తెలిపారు. చిననందిపల్లి సర్వే నెం.50లో 3.37 ఎకరాలు, సర్వే నెం.112లో 5.03 ఎకరాల పంట భూములు ఉన్నాయన్నారు. దేవస్థానానికి చెందిన ఈ 8.40 ఎకరాలు పంట పొలాలకు 2024 జూన్ 4 నుంచి 2027 జూన్ 3 వరకు మూడేళ్ల కాలపరిమితి కౌలుకు టెండర్, బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.3 వేలు ధరావతు చెల్లించాలన్నారు.

వేలం పూర్తయిన వెంటనే హెచ్చు పాట దారుడు తొలి సంవత్సరం బిడ్, శిస్తు మొత్తం చెల్లించాల్సి ఉంటుందన్నారు. జూన్ 3న ఉదయం 10 గంటల నుంచి వేలం ప్రారంభమవుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఉమానీలకంఠేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వాణాధికారిని సంప్రదించాల్సిందిగా సూచించారు.

అడ్డాకులకు అదిరే ధర

అడ్డాకులు గిరిజనులకు అధిక ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి. ప్రస్తుతం గిట్టుబాటు ధర ఉండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కావిడ అడ్డాకుల ధర రూ.2000 వరకు పలుకుతుండటంతో ఆకుల సేకరణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.


అడవిలో అడ్డాకుల పాదులు


హుకుంపేటలో అడ్డాకులను అమ్ముతున్న గిరిజనులు

- గిరిజనులకు సిరులు కురిపిస్తున్న అడ్డాకుల సేకరణ
- ఈ ఏడాది ముమ్మరంగా సేకరణ, విక్రయాలు
- ధర గిట్టుబాటు కావడంతో ఆనందం

సాక్షి,పాడేరు: అడవినే నమ్ముకుని పూర్వం నుంచి జీవిస్తున్న గిరిజనులకు వేసవి కాలం వచ్చిందంటే అడ్డాకులను సేకరించడమే ప్రధాన వ్యాపకం. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో అడవుల్లో విస్తారంగా అడ్డాకులు లభిస్తున్నాయి. దీంతో గత మూడు వారాల నుంచి అడ్డాకులను సేకరిస్తున్న గిరిజనులు వాటిని బాగా ఆరబెట్టి అమ్మకాలు జరుపుతున్నారు. వారికి అదనపు ఆదాయం లభిస్తుండటంతో అడ్డాకుల సేకరణపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు.

కావిడ అడ్డాకులు రూ.2 వేలు

ప్రస్తుతం ఏజెన్సీ వ్యాప్తంగా అడ్డాకుల అమ్మకాలు జోరందుకున్నాయి. మైదాన ప్రాంతాలలో అడ్డాకులకు డిమాండ్ ఉండడంతో వ్యాపారులు పోటాపోటీగానే కొనుగోలు చేస్తున్నారు.సీజన్ ప్రారంభ దశ కావడంతో కావిడ అడ్డాకులను రూ.2వేలతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.ముమ్ముందు ధర పెరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు చెందిన గిరిజన కుటుంబాలే అధికంగా అడవులలో అడ్డాకులను సేకరిస్తుంటాయి.అడ్డాకుల సీజన్‌లో కనీసం రూ.20వేల వరకు ఆదాయం లభిస్తుంది. ఈసీజన్‌లో గిరిజనులకు అడ్డాకులు మంచి ఆదాయ వనరుగా మారింది.

పలు రాష్ట్రాల్లో డిమాండ్

ఏజెన్సీలో గిరిజనుల వద్ద కొనుగోలు చేసిన అడ్డాకులను తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు,కర్నాటక,కేరళ రాష్ట్రాల్లో అధికంగా డిమాండ్ ఉంది.


ఆటోలో అడ్డాకులను మైదాన-ప్రాంతానికి తరలిస్తున్న దృశ్యం

ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఏజెన్సీలో అడ్డాకులను కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తుంటారు. జిల్లాలో హుకుంపేట, అరకు,గుత్తులపుట్టు,జి.మాడుగుల,అన్నవరం,లోతుగెడ్డ,తాజంగి వారపుసంతలలో ప్రతివారం కనీసం రూ.20లక్షల వరకు అడ్డాకుల వ్యాపారం జరుగుతుంది.అడ్డాకులు అమ్మకాలతో గిరిజన కుటుంబాలతో పాటు వ్యాపారులకు కూడా మంచి ఆదాయం చేకూరుతుంది.

ఇంటర్ సప్లిమెంటరీకి 7,740 మంది హాజరు

తుమ్మపాల: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన ఫిజిక్స్, ఎకనామిక్స్‌కు పరీక్షలకు 7,740 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా ఇంటర్‌మీడియట్ అధికారి బి.సుజాత తెలిపారు. ఉదయం జరిగిన ఫస్టియర్ పరీక్షలకు 5,799 మందికి గాను 5,486 మంది, మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షలకు 2,368 మందిలో 2,254 మంది హాజరైనట్లు వెల్లడించారు. జిల్లాలో 20 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయన్నారు.

ఒకటి నుంచి గిరిజన గురుకుల పాఠశాలలో ప్రవేశాలు

మధురవాడ: మారికవలస-తిమ్మాపురం రోడ్డులోని సీబీఎస్ఈ గుర్తింపు పొందిన ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర ఇంగ్లిష్ మీడియం స్కూల్లో జూన్ ఒకటో తేదీ నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ శివప్రసాద్ చెప్పారు. ఇక్కడ 5వ తరగతిలో ప్రవేశం కోసం ఉదయం 10 గంటల నుంచి కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ఎంపికైన విద్యార్థులకు కాల్ లెటర్స్, ఫోన్ ద్వారా సమాచారం అందజేసినట్టు తెలిపారు. అలాగే పాడేరు ఐటీడీఏ కార్యాలయంలో నోటీసు బోర్డు ద్వారా కూడా తెలియజేశామన్నారు. మరిన్ని వివరాలకు 95029 56307, 94909 57232లో సంప్రదించాలని కోరారు.

నూకాలమ్మ ఆలయంలో చోరీపై దర్యాప్తు

యలమంచిలి రూరల్: పట్టణంలోని బస్టాండు సమీపంలో ఉన్న నూకాలమ్మ ఆలయంలో మంగళవారం జరిగిన చోరీపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. గుర్తు తెలియని వ్యక్తి ఆలయంలోని రెండు హుండీల తాళాలు పగులగొట్టి నగదు దోచుకెళ్లాడు. దీనిపై ఆలయ కమిటీ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు చోరీకి పాల్పడిన వ్యక్తిని గుర్తించే పనిలో ఉన్నారు. ఈ తరహా నేరాలు అలవాటున్న పాత నేరస్తులపై అనుమానంతో వారి కదలికలను ఆరా తీస్తున్నారు.

యువతకు సాల్వ్ ఫర్ టుమారో పోటీలు

బీచ్‌రోడ్డు (విశాఖ): సమస్యల పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచనలపై విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడానికి సాల్వ్ ఫర్ టుమారో పేరుతో పోటీలు నిర్వహిస్తున్నట్లు శాంసంగ్ కో ఆర్డినేటర్ ఎస్‌పి చున్ తెలిపారు. పోటీల వివరాలను ఆయన మీడియాకు తెలిపారు. నాయకత్వం వహించేందుకు యువ ఆవిష్కర్తలకు ఈ కార్యక్రమం ఆహ్వానం పలుకుతుందన్నారు. విజేతలకు రూ. 25 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు గ్రాంట్‌ను బహుమతిగా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో సెమీ కండక్టర్ పరికరాలతో శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడం నుంచి ఏఐ ద్వారా నూతన ఆవిష్కరణల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు సాల్వ్ ఫర్ టుమారో వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికలు


పోటీలకు ఎంపికైన బాల, బాలికలు

భీమునిపట్నం: విశాఖ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఇక్కడ వుడా మైదానంలో రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు బాల, బాలికల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జట్టుకు 12 మంది చొప్పున రెండు జట్లకు 24 మంది బాల, బాలికలను ఎంపిక చేశారు. ఇందులో ఎంపికైన వారు ఈనెల 31వ తేదీన బీచ్‌రోడ్డులోని తిమ్మాపురంలోని విజ్ఞాన్ విద్యాలయంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.లలిత్‌కుమార్ తెలిపారు.

మధ్యాహ్న భోజనం మెనూ అమలు చేయాల్సిందే


దిబ్బిడిలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న అధికార్లు


సమావేశంలో పాల్గొన్న పలు గ్రామాల మధ్యాహ్న భోజన నిర్వాహకులు

- మధ్యాహ్న భోజన నిర్వాహకులతో విద్యాశాఖ సిబ్బంది

బుచ్చెయ్యపేట: విద్యార్థుల మెరుగైన పోషణ కోసం ప్రభుత్వం అందించిన మెనూను పాఠశాలల్లో అమలు చేయాల్సిందేనని డీఈవో కార్యాలయ మధ్యాహ్న భోజన(ఎండీఎం) బృందం సభ్యుడు అచ్యుతరావు, ఎంఈవో బుద్ద కాశీ శంకర్ విశ్వేశర రావులు తెలిపారు. దిబ్బిడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం బుచ్చెయ్యపేట మండలంలోని 68 స్కూళ్ల ఎండీఎం నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థుల కోసం ప్రభుత్వం సూచించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజు కోడి గుడ్డు అందించాలన్నారు. భోజన తయారీలో అవకతవకలకు తావులేకుండా ఆయా స్కూళ్ల సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందన్నారు. విద్యార్థుల్లో రక్తహీనత లేకుండా పోషకాలున్న సంపూర్ణ ఆహారం అందించడం ద్వారా ఉన్నత చదువులు చదివి, పేదింటి పిల్లలు ప్రయోజకులు అవ్వాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని దిబ్బిడి హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ పాతాళ సత్తిబాబు అన్నారు. సమావేశంలో ఎండీఎం రిసోర్స్ పర్సన్ గూనూరు వరలక్ష్మి, పీఈ ర్పీలు శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ రికార్డుల డిజిటలీకరణ

- ప్రత్యేక యాప్‌లో నమోదు
- చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ

చింతపల్లిరూరల్: అటవీ శాఖకు సంబంధించిన అన్ని రికార్డులనూ వన అనే ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి వాటన్నింటినీ పూర్తిగా డిజిటలైజ్ చేస్తున్నామని అటవీ శాఖ చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ తెలిపారు. చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంలో అటవీ శాఖ అధికారులు, ఉద్యోగులకు రెండు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ అటవీ శాఖకు సంబంధించిన అన్ని వివరాలు సమగ్రంగా డిజిటలీకరణ చేయడం ద్వారా సులభతరంగా వ్యవస్థ ఉంటుందన్నారు. ఏ సమాచారం కావాలన్నా కేవలం యాప్ ద్వారా తెలుసుకునేందుకు ఆస్కారం ఉంటుందని చెప్పారు. రెండు రోజులపాటు జరిగే శిక్షణను అటవీ అధికారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఢిల్లీనుంచి వచ్చిన ప్రత్యేక నిపుణులు శ్యాందావన్, సాయల్ సందీప్ పలు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో బెర్నాడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా రైళ్ల రాకపోకలు

తాటిచెట్లపాలెం: పెయిరింగ్ రైళ్ల ఆలస్యం కారణంగా.. ఆయా స్టేషన్ల నుంచి అంతే ఆలస్యంగా రైళ్లు బయలుదేరుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- తాంబరం-సంత్రగచ్చి (22842) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ సుమారు 13 గంటలు ఆలస్యంగా బుధవారం రాత్రి 8గంటలకు బయలుదేరింది.
- ఎస్ఎంవీటీ బెంగళూరు-అగర్తల (12503) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ సుమారు 26 గంటలు ఆలస్యంగా బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరింది.
- సంత్రగచ్చి-సికింద్రాబాద్(07222) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 8 గంటలు ఆలస్యంగా బుధవారం రాత్రి 8గంటలకు బయలుదేరింది.
- హుబ్బళ్లి - నహర్‌లగున్(07387) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా బుధవారం సాయంత్రం 4.05 గంటలకు బయలుదేరింది.
- ఎస్ఎంవీటీ బెంగళూరు-మాల్డా టౌన్ (06565) సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 8 గంటలు ఆలస్యంగా బుధవారం మధ్య రాత్రి 12.15 గంటలకు బయలుదేరింది.
- ముజఫర్‌పూర్- మైసూరు (06222) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ గంటంపావు ఆలస్యంగా బుధవారం మధ్యాహ్నం 2.15 గంటలకు బయలుదేరింది.
- డిబ్రూఘడ్-న్యూ నాగర్‌కోయల్ (06104) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా బుధవారం రాత్రి 11.55 గంటలకు బయలుదేరింది.
- గురువారం రాత్రి 11.40 గంటలకు సంత్రగచ్చిలో బయలుదేరాల్సిన సంత్రగచ్చి-తాంబరం (06090) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు మూడున్నర గంటలు ఆలస్యంగా శుక్రవారం తెల్లవారు 3.10 గంటలకు బయలుదేరుతుంది.
- గురువారం మధ్యాహ్నం 12.10 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరాల్సిన భువనేశ్వర్-రామేశ్వరం(20896) ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా మధ్యాహ్నం 1.10 గంటలకు బయలుదేరుతుంది.

పూరిల్లు దగ్ధం.. రూ.2 లక్షల ఆస్తి నష్టం


అగ్నికి ఆహుతైన పూరిల్లు


మంటల్ని ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు

మాడుగుల రూరల్: మండలంలోని చింతలూరు గ్రామంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక పూరిల్లు దగ్ధమయింది. గ్రామానికి చెందిన పెంటకోట అప్పారావుకు చెందిన పూరింట్లోని ఇన్వర్టర్ షార్ట్ సర్క్యూట్ వల్ల వ్యాపించిన మంటలకు ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని విలువైన వస్తువులు ఫ్రిజ్, ఫ్యాన్, నిత్యావసర వస్తువులు, బట్టలు, నగదు, టెన్త్, ఇంటర్, డిగ్రీ, సర్టిఫికెట్లతో పాటు భూమి పాసు పుస్తకాలు కాలిపోయాయి. ఆస్తి నష్టం సుమారు రూ.2 లక్షలు ఉంటుందని అంచనా. ప్రమాద విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న మాడుగుల అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలికి వెళ్లి మంటల్ని అదుపు చేశారు. అగ్నిమాపక కేంద్రం అధికారి వి.రాజేశ్వరావు నేతృత్వంలో సిబ్బందికి స్థానికులు సాయపడ్డారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది.

గోవాడ ఫ్యాక్టరీని సందర్శించిన కేంద్ర సహకార శాఖ ప్రతినిధులు


చెరకు రైతులతో మాట్లాడుతున్న పార్స్ ప్రతినిధులు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీని కేంద్ర సహకార శాఖకు చెందిన పాలసీ అడ్వొకసీ రీసెర్చ్ సెంటర్ (పార్స్) ప్రతినిధులు చైతన్య, నీరజ్‌దేశ్‌రాజ్ బుధవారం సందర్శించారు. తొలుత అంభేరుపురం, గజపతినగరం గ్రామాల పరిధిలో చెరకు తోటలను పరిశీలించి, సాగు విస్తీర్ణం ఎందుకు తగ్గిందో తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర సహకార రంగంలో నడుస్తున్న గోవాడ సుగర్‌ఫ్యాక్టరీ స్థితిగతులపై ఫ్యాక్టరీ యాజమాన్యంతో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ గుర్తింపు కార్మిక యూనియన్ అధ్యక్షుడు కె.వి.వి.భాస్కరావు, కార్మిక సంఘం నాయకులు ఈ బృందం సభ్యులను కలిసి ఫ్యాక్టరీని ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ పథకాన్ని చెరకు సాగుకు అనుసంధానం చేయాలని, తక్షణం రూ.20 కోట్లు నిధులు సమకూర్చి ఫ్యాక్టరీని ఆదుకోవాలని, ఉత్పత్తి అయిన పంచదారను సకాలంలో అమ్మకాలు చేసుకునే వెసులుబాటు కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

31న పలాస-విశాఖ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధి నౌపడ-పూండి సెక్షన్ మధ్య మెయిన్‌లైన్‌లో బ్రిడ్జి పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా ఈ నెల 31న పలాస-విశాఖపట్నం-పలాస (07471/ 07470) పాసింజర్ స్పెషల్‌ను రద్దు చేశారు. ఈ నెల 31, జూన్ 3వ తేదీల్లో విశాఖపట్నం-రాయ్‌పూర్ (08528) పాసింజర్ స్పెషల్ సెక్షన్ పరిధిలో 30 నిమిషాలు, 45 నిమిషాలు నియంత్రిస్తారు.

బిడ్డతో సహా సముద్రంలో దూకిన తల్లి


చంటి బిడ్డతో సహా తల్లిని రక్షించిన జీవీఎంసీ లైఫ్‌గార్డ్ అప్పలరాజు

రక్షించిన లైఫ్‌గార్డ్

ఆరిలోవ: చంటి బిడ్డతో సముద్రంలో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ తల్లిని జీవీఎంసీ లైఫ్‌గార్డ్ రక్షించాడు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా నగరానికి చెందిన ఎస్.దుర్గాభవాని తన పది నెలల చంటి బిడ్డతో బుధవారం జోడుగుళ్లపాలెం బీచ్ వద్ద సముద్రంలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఇది గమనించిన జీవీఎంసీ లైఫ్‌గార్డ్ జి. అప్పలరాజు వెంటనే స్పందించి తల్లీబిడ్డను రక్షించాడు. అనంతరం వారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమస్యకు పరిష్కారం ఆత్మహత్య కాదని ఆమెకు అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



యలమంచిలి రూరల్: యలమంచిలి బస్టాండు సమీపంలో సుమారు 50 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. స్పృహ కోల్పోయిన వ్యక్తిని 108 అంబులెన్సులో యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అతడ్ని పరిశీలించిన డ్యూటీ డాక్టర్ నిహారిక అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని యలమంచిలి మార్చురీలో భద్రపరిచారు. నలుపు రంగు ఫ్యాంటు, బూడిద రంగు గడుల చొక్కా ధరించి ఉన్న మృతుని వివరాలు తెలిసినవారు యలమంచిలి పట్టణ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ పాపినాయుడు తెలిపారు.

సెల్‌ఫోన్ చూడొద్దన్నందుకు బాలిక ఆత్మహత్య

పీఎంపాలెం: అదే పనిగా సెల్‌ఫోన్ చూస్తున్న కుమార్తె(14)ను ఆమె తల్లి మందలించడంతో.. మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. పీఎంపాలెం సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 7వ వార్డులోని వాంబేకాలనీలో కె.అన్నపూర్ణ కుటుంబంతో నివసిస్తున్నారు. ఆమె ఇంటి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టు కొస్తోంది. మైనర్‌లు అయిన కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె సెల్‌ఫోన్‌కు బానిస కావడంతో అసహనానికి గురైన తల్లి.. ఆమెను మందలించింది. దీనిని అవమానంగా భావించిన బాలిక మంగళవారం సాయంత్రం ఇంట్లోనే ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. కొంతసేపటికి ఇంటికి వచ్చిన అన్నపూర్ణ.. కుమార్తెను చూసి షాక్ గురైంది. స్థానికుల సాయంతో వెంటనే గీతం ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.10 లక్షల నగదు చోరీ

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.10 లక్షలు చోరీకి గురైనట్లు బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. అజిత్ మిండ వృద్ధురాలైన తన తల్లితో కలసి కిర్లంపూడి లేఅవుట్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన రెండు రోజుల కిందట పని మీద వేరే ప్రాంతం వెళ్లారు. ఆ సమయంలో తల్లికి తోడుగా పనిమనిషిని పెట్టారు. కాగా.. బుధవారం ఇంటికి వచ్చిన ఆయనకు పని మనిషి కనబడకపోవడంతో అనుమానం వచ్చింది. వెంటనే బీరువా తెరిచి చూడగా.. అందులో ఉంచిన రూ.10 లక్షలు నగదు కనిపించలేదు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

కశింకోట : మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం అనకాపల్లి పార్టీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసినట్టు ఎంపీపీ కలగా లక్ష్మి, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు తెలిపారు. అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మలసాల అభిమానులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

భారత్ వికాస్ పరిషత్ అనకాపల్లి అధ్యక్షుడిగా వర్మ

అనకాపల్లి : అనకాపల్లి భారత వికాస్ పరిషత్ అధ్యక్షునిగా ఎస్.ఎ.బి.వర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక నర్సింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో బుధవారం జరిగిన ఎన్నికల్లో పరిషత్ కార్యదర్శిగా డి.శివరామర్, కోశాధికారిగా జి.లక్ష్మీనారాయణతోపాటు మరో 25 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. పై కమిటీ ఎన్నికల నిర్వహణ అధికారిగా తుని భారత వికాష్ పరిషత్ ప్రతినిధి ఆంజనేయులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పై కమిటీ ఏడాది పాటు ఉంటుందని తెలిపారు. ఏడాదిలో ప్రతి నెలలో పేదవర్గాల ప్రజలకు చేసే సేవలపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ సీనియర్ సభ్యులు పీల్లా నిర్మల, ఎస్.గోపాలరావు, ఆళ్ల ఓంరామ్, వై.కేశవరావు, రాపేటి నారాయణరావు, రాఘవరావు పాల్గొన్నారు.

ఎకరాకు 10 టన్నుల పశువుల గెత్తం వేసుకోవాలి

అనకాపల్లి : వర్షాధార చెరకు పంటకు నేల తయారుచేసుకుని, ఎకరాకు 10టన్నుల పశువుల గెత్తం పొలంలో వేసి కలిపి దున్నుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ పీవీకె.జగన్నాథరావు అన్నారు. తమ కార్యాలయంలో బుధవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 120 రోజుల వయసు గల చెరకు మొక్క, కార్శిచేసిన తోటలో మొక్కల మొదళ్లకు ఎత్తుగా మట్టిని ఎగదోయాలని సూచించారు. వర్షాలకు కలుపు సమస్య ఎక్కువగా ఉంటుందని, కలుపు సమస్య అధికంగా ఉన్నచోట మెట్రిబుజిన్ 400 గ్రా.., 2,4–డి సోడియం సాల్ట్ 800 గ్రా..ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని ఆయన సూచించారు. ఎక్కడైనా ఇంకా పచ్చిరొట్ట పైరును విత్తుకోని రైతులు, తేమను చూసుకుని జనుము, జీలుగ, పిల్లిపెసర, అపరాలు రైతులు వేసుకోవాలని ఆయన కోరారు.

అనకాపల్లి సినిమాలు

డర్టీ ఫెలో	: రాజా
ఫ్యూరియోసా	: సత్యనారాయణ స్క్రీన్-1
వ్యాన్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటీ అడక్కు	: పర్తిసాయి
రాజుయాదవ్	: వెంకటేశ్వర
దర్శిని : శ్రీసత్య	
కృష్ణమ్మ	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధ వారం 348 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,400	4,230
రెండో రకం	3,940	4,400
మూడోరకం	3,400	4,080

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 49 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-30 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 332 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 201 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (0892 4223595)ని సంప్రదించవచ్చు.

కూరగాయల సాగు...బహు బాగు



పశువుల ఎరువును జల్లుతున్న మహిళా రైతు



జి. భీమవరంలో కూరగాయల సాగుకు దున్ని సిద్ధం చేసిన పంట భూములు



జి. భీమవరంలో సరుగుడులో అంతర పంటగా బెండసాగు

తొలకరి వర్షాలు వస్తే కూరగాయల విత్తనాలు నాటడానికి రైతులు సన్నద్ధమవుతున్నారు. మండలంలో ఖరీఫ్‌లోను, రబీలోను కూరగాయల సాగు చేపడతారు. బీరకాయ, కాకరకాయ, పొట్లకాయ, బెండకాయ, టమాటా బరబాటి, ఆనబ, చిక్కుడు, వంకాయ, గుమ్మడి తదితర కూరగాయలను పండిస్తుంటారు. పలువురు రైతులు కూరగాయలను అంతర పంటగా కూడా సాగు చేస్తూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు.

- తొలకరి వర్షాల కోసం ఎదురుచూపులు
- దుక్కి దున్ని భూములు సిద్ధం చేసుకున్న రైతులు
- మండలంలో విరివిగా పండిస్తున్న రైతులు

కశింకోట : మండలంలో కూరగాయల సాగుకు రైతులు పంట భూములను సిద్ధం చేశారు. ముఖ్యంగా జి. భీమవరం, సుందరయ్యపేట, ఆనందపుర, కన్నూరుపాలెం, తీడ, చెరకాం, జమాదులపాలెం, పరవాడపాలెం, అడ్డాం, కశింకోట, వెదురుపర్తి, విసన్నపేట, బయ్యవరం తదితర గ్రామాల్లో కూరగాయల సాగు అధికంగా చేపడతారు. ఖరీఫ్‌లో ఎక్కువగా బీరకాయ, బెండకాయ, కాకరకాయ, బరబాటి తదితర కూరగాయలను పండిస్తారు. రబీలో టమాటా, ఆనబ, చిక్కుడు, వంకాయ తదితర పంటలను సాగు చేస్తారు. ఇటీవల అడపా దడపా కురిసిన వర్షాలకు పంట భూములను దుక్కి దున్నించి పశువుల పేడ ఎరువుగా వేసి సిద్ధం చేశారు. తొలకరి వర్షాలు పడగానే కూరగాయల సాగు చేపడతారు. విత్తిన దాదాపు మూడు నెలలకు కాయలు కాసి కోతకు వస్తాయి. వీటిని స్థానికంగా అమ్మకానికి పెడతారు. వ్యాపారులు వచ్చి వీటిని కొనుగోలు చేసి అనకాపల్లి, గాజువాక, విశాఖ వంటి ప్రాంతాలకు తరలించుకు వెళ్లి విక్రయించుకుంటారు. కొందరు రైతులు తాళ్లపాలెం, కశింకోట, కన్నూరుపాలెం ప్రాంతంలో జరిగే సంతలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. మండలంలోని తీడ ప్రాంతం నుంచి రోజూ విశాఖ రైతు బజార్లకు ఆర్టీసీ బస్సుల్లో కూరగాయలు తరలిస్తుంటారు. తీడ, చెరకాం, సుందరయ్యపేట, ఎల్.కొత్తూరు తదితర ప్రాంతాల నుంచి రైతులు పండించిన కూరగాయలు ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించి ఆదాయం పొందుతున్నారు.

అంతర పంటలతో లాభాలు

పలువురు రైతులు కూరగాయలను అంతర పంటగా సాగు చేస్తూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. జి.భీమవరంలో సరుగుడు తోటలో అంతర పంటగా బెండ సాగు చేస్తున్నారు. ఏడాదిలోపు వయస్సు ఉన్న సరుగుడులో ప్రయోగాత్మకంగా దీని సాగు చేపట్టారు. అది ఏపుగా ఎదిగి కాయలు కాసి ఆదాయాన్ని సమకూరుస్తోంది. అయితే ఇది మొదటి ఏడాది మాత్రమే సాగుకు అనుకూలంగా ఉంటుంది. ఆ తర్వాత సరుగుడు ఎదిగి విస్తరించడం వల్ల ఇకపై అవకాశం ఉండదు.

ముప్పై ఏళ్లుగా సాగు



మూడు దశాబ్దాలు పైగా కూరగాయలు సాగు చేస్తున్నాను. సుమారు ఎకరం భూమిలో ఏటా బీరకాయ, కాకర, చిక్కుడు, బరబాటి వంటి కూరగాయలను పండిస్తుంటాం. ఏటా ఖరీఫ్‌లో తొలకరి వర్షాలకు కూరగాయలు నాటుతాం. మూడు నెలలకు కాపు కాసి కోతకు కాయలు వస్తాయి. వీటిని స్థానికంగాను, సంతలకు తీసుకెళ్లి విక్రయించి జీవనోపాధి పొందుతుంటాం. ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి అవుతోంది. వాతావరణం అనుకూలించి బాగా కాస్తే మంచి ఆదాయం సమకూరుతుంది.

–హనుమంతు శ్రీనివాసరావు, కూరగాయల రైతు, జి. భీమవరం

అంతర పంటగా బెండ



ఈ ఏడాది సరుగుడు సాగు చేపట్టాం. దానిలో అంతర పంట సాగు చేస్తే ఎలా ఉంటుందని ప్రయోగాత్మకంగా బెండ సాగు చేపట్టాం. ఏపుగా ఎదిగి కాపుకొచ్చి కాయలు కాస్తున్నాయి. వీటిని విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం లభిస్తోంది. కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతోంది. దీని సాగు ఈ ఏడాదికి మాత్రమే అవకాశం ఉంటుంది. వచ్చే ఏడాది నుంచి సరుగుడు ఎదుగుదల వల్ల నీడ వచ్చి సాగుకు అవకాశం ఉండదు. అంతర్ పంటగా బెండ సాగు చేపట్టడం వల్ల అదనపు ఆదాయం సమకూరుతుంది. లాభదాయకంగా ఉంది.

– ఈశ్వరమ్మ, మహిళా రైతు, జి. భీమవరం




మధ్యాహ్నం 3 గంటలకు కూడా బోసిపోతున్న కశింకోట ప్రధాన రహదారి



వేంపాడులో తలకు గుడ్డలు కట్టుకుని వెళ్తున్న మహిళలు

నిప్పుల కొలిమిలా...

- సూర్యతాపానికి ప్రజలు విలవిల
- రోహిణికార్తె ప్రభావం
- నిర్మానుష్యంగా హైవే
- ఎక్కడికక్కడ సేదతీరిన ప్రయాణికులు



ఉదయం ఆరు గంటలకు చుర్రుమంటున్న సూరీడు

నక్కపల్లి : రోహిణి కార్తె తన ప్రభావాన్ని చూపిస్తోంది. బుధవారం భానుడు భగభగ మన్నాడు. ఎండవేడిమికి ప్రజలు విలవిల లాడిపోయారు. గడచిన నాలుగు రోజుల నుంచి నెత్తిపై నిప్పుల కుంపటి అన్నట్లుగా ఉంది వాతావరణం. నిప్పుల కొలిమితో జాతీయ రహదారిపై రాకపోకలు సాగించేవారు అనేక అవస్థలు పడ్డారు. సూర్యతాపానికి ఇళ్లల్లో నుంచి ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. గత నాలుగు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండడంతో ఎండ చుర్రుమంటోంది. బుధవారం పరిస్థితి మరీ దారుణంగా ఉంది. జాతీయ రహదారి నిర్మానుష్యంగా మారింది. సూర్యభగవానుని ఉగ్రరూపానికి ఎవరూ ప్రయాణాలు చేయలేక రద్దు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పది దాటితే ఎవరూ బయట తిరిగే సాహసం చేయలేకపోతున్నారు. ఉదయం ఆరు గంటలకు సూర్య ప్రతాపం మొదలవుతోంది. ఉపాధి పనులకు వెళ్లే వారు తొమ్మిది గంటలకే ఇంటి ముఖం పట్టారు. జాతీయ రహదారిపై ఎక్కడ సేదతీరడానికి చెట్లు, షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణాలు సాగించేవారు నరక యాతన పడ్డారు. రోడ్డుకు ఇరువైపులా నేషనల్ హైవే వారు నాటిన చిన్నమొక్కల నీడన సేదతీరాల్సిన దుస్థితి ఏర్పడింది. తప్పని పరిస్థితుల్లో రోడ్డుపై రాకపోకలు సాగించేవారు తలకు తడిగుడ్డలు చుట్టుకుని ప్రయాణించడం ప్రతి ఫర్లాంగు దూరానికి గుక్కెడు మంచినీళ్లు తాగి ఉపశమనం పొందుతున్నారు. ద్విచక్రవాహన చోదకులు లారీల, వ్యాన్‌ల సందడి పెద్దగా లేకపోవడంతో జాతీయరహదారి నిర్మానుష్యంగా మారింది.

పది గంటలు దాటితే వాహనాల రాకపోకలు రోడ్డుపై పెద్దగా కనిపించలేదు. సూర్యతాపాన్ని దష్టిలో ఉంచుకుని జాతీయరహదారిపై కొబ్బరి బొండాల విక్రయాలు జోరందుకున్నాయి. ఒక్కో బొండాం రూ.30లకు విక్రయించారు. పుచ్చకాయల ముక్కలను సయితం ఐదు ముక్కలు రూ.20లకు విక్రయించారు. జాతీయరహదారిపై చలివేంద్రాలు లేకపోవడంతో వాటర్ ప్యాకెట్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. బుధవారం మండలంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయినట్టు తెలుస్తోంది.

ఎండలకు రోడ్లు నిర్మానుష్యం

కశింకోట : కశింకోట ప్రాంతంలో వరుసగా రెండో రోజు బుధవారం కూడా సూర్యుడు ప్రతాపం చూపాడు. ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితిని ప్రజలు ఎదుర్కొన్నారు. ఇంకా ఎన్నాళ్లు ఎండలు భరించాలోనని ఆందోళన చెందుతున్నారు. ఉదయం 11 గంటల ప్రాంతం నుంచి ఎండ తీవ్రత పెరగడంతో అత్యవసర పనులు ఉన్న వారు తప్ప ఎవరూ బయటకు రావడానికి సాహసించలేదు. దీంతో ఇక్కడి ప్రధాన రహదారులు జన సంచారం లేక బోసిపోయాయి. సాయంత్రం 4 గంటల వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. ఆ తర్వాత క్రమేపి ఉష్ణోగ్రత తగ్గడంతో ప్రజలు తమ నిత్య కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్ : విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 33/11కెవి పెదపల్లి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధి కొక్కిరాపల్లి 11కెవి ఫీడర్ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ మీడియాకు తెలిపారు. కొక్కిరాపల్లి,పెదపల్లి గ్రామాలతో పాటు రాంనగర్, ఎర్రవరం వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. నర్శింగబిల్లి 132/33కెవి సబ్ స్టేషన్ పరిధి పురుషోత్తపురం 33 కేవీ ఫీడర్ పరిధిలో కూడా విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేస్తున్నామన్నారు. దీనివల్ల పులపర్తి, బయ్యవరం, పీఎస్‌ఆర్‌పేట మైహోం ఇండస్ట్రీస్, విశాఖ డెయిరీలకు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఆర్‌ఎంపీ క్లినిక్‌ల తనిఖీలు

గొలుగొండ: ఏఎల్ పురం(కృష్ణదేవిపేట) గ్రామ పరిధి లోని ఆర్‌ఎంపీ వైద్యులు నిబంధనల మేరకు వైద్య సేవలు అందించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని కృష్ణదేవిపేట వైద్యాధికారి హరిప్రవీణ్ హెచ్చరించారు. ఆయన మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం స్థానిక ఆర్‌ఎంపీ వైద్యులు నిర్వహించే క్లినిక్‌లను తనిఖీ చేశారు. వారి సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఆర్‌ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందించడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ప్రతి ఆర్‌ఎంపీ క్లినిక్‌ను పరిశిలించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే నోటీసులు జారీ చేస్తామన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

మాడుగుల: అగ్ని ప్రమాదాలు వాటిల్లకుండా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని మాడుగుల అగ్నిమాపక కేంద్రం దళాధికారి వి.రాజేశ్వరావు తెలిపారు. అగ్ని ప్రమాదాలు-నివారణ అంశంపై స్థానిక శ్రీనివాస ఆస్పత్రి వద్ద బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి యాజమాన్యానికి వంట గ్యాస్ వల్ల జరిగే అనర్థాలపై డెమో ఇచ్చారు.

2న ఒమ్మలి మోదమాంబ పండగ

మాడుగుల: మండలంలోని ఒమ్మలి గ్రామంలో ఈ నెల 2న మోదమాంబ అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం తెలిపారు. పండగ సందర్భంగా ఆ రోజు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుపుతామన్నారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. భక్తులు విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.

ఆర్బీకేలకు ఖరీఫ్ వరి విత్తనాలు



రైవాడ ఆర్బీకేలో సిద్ధంగా ఖరీఫ్ వరి విత్తనాలు

దేవరాపల్లి: మండలంలోని రైవాడ రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఖరీఫ్‌కు సంబంధించి ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా సరఫరా చేసేందుకు అవసరమైన విత్తనాలతో లారీలు బుధవారం ఆర్బీకేలకు చేరాయి. వీటిని స్థానిక వ్యవసాయ శాఖ అధికార్లు భద్రపరిచారు. ఆర్‌జీఎల్, ఇంద్ర, సోనామసూరి, అమర్ తదితర రకాల వరి విత్తనాలు ఉన్నాయి. మండలంలోని 20 ఆర్బీకేలకు ఇండెంట్ మేరకు విత్తనాలు అందుబాటులోకి రాగానే రైతులకు పంపిణీ చేస్తామని మండల వ్యవసాయ అధికార్లు చెబుతున్నారు.

5న పర్యావరణంపై చిత్రలేఖన పోటీలు

అనకాపల్లి : స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో జూన్ 5వ తేదీన ఉదయం 9 గంటలకు గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని «చిత్రలేఖన పోటీలు» నిర్వహిస్తున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలు పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై మూడు విభాగాలుగా కిడ్స్, జూనియర్స్, సీనియర్స్‌గా విభజించి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు గ్రంథాలయ ఆవరణలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ సరఫరా చేయాలి

కశింకోట : ఉపాధి కూలీలకు వేసవి తీవ్రత దృష్ట్యా పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేసి మజ్జిగను సరఫరా చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయు జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కోరారు. మస్టర్ వేసిన అన్ని రోజులకు ఉపాధి కూలీలకు కూలీ సొమ్ము చెల్లించడానికి కూడా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

10 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు

కశింకోట : మండలంలోని అచ్చెర్లలో అక్రమంగా నాటు సారా తరలిస్తున్న ఇద్దర్ని పట్టుకొని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. వారి వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అచ్చెర్ల గ్రామానికి చెందిన సాలెపు అప్పలనాయుడు 8 లీటర్లు, వేపాడ చిన బాబు 2 లీటర్లు వంతున వేర్వేరుగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వారి నుంచి సారా స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితుల్ని అరెస్టు చేసినట్టు తెలిపారు.

చినదొడ్డిగల్లులో కార్డన్ సెర్చ్



చినదొడ్డిగల్లులో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

సరైన పత్రాలు లేని 47 వాహనాలు స్వాధీనం

నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లులో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నక్కపల్లి, ఎస్‌రాయవరం, పాయకరావుపేట, కోటవురట్ల పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బుధవారం ఉదయం 5 గంటల నుంచి తొమ్మిది గంటల వరకు ఈ కార్యక్రమం జరిగింది. ప్రతి ఇంటిని గాలించారు. ఈ సందర్భంగా ఎటువంటి రికార్డుల్లేని 47 వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. ద్విచక్రవాహనాలతోపాటు, ఒక కారు, ఒక ఆటోను కూడా స్వాధీనం చేసుకోవడం జరిగిందని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయా వాహనదారులు సంబంధిత రికార్డులు చూపిస్తే యజమానులకు తిరిగి వాటిని అప్పగించడం జరుగుతుందన్నారు. రికార్డులు లేని వాహనాలను ఆర్‌టీవోకు అప్పగించడం జరుగుతుందన్నారు. త్వరలో జరగబోయే కౌంటింగ్‌ను పురస్కరించుకుని, గంజాయి అక్రమ రవాణాలకు సంబంధించి ఇటువంటి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.

కౌంటింగ్ సందర్భంగా ముందు జాగ్రత్తలు

కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా అన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని సీఐ చెప్పారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఊరేగింపులు, బాణాసంచా కాల్చడం వంటివి నిషేధించడం జరిగిందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు లోబడి ఈ నిబంధనలు పాటించాలని ఆయన కోరారు. గతంలో నెలకొన్న ఘర్షణలను దృష్టిలో ఉంచుకుని ఈ సార్వత్రిక ఎన్నికలకు ముందుగానే మండలంలో సుమారు 900 మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు. శాంతిభద్రతలకు ప్రజలు, రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలన్నారు. కౌంటింగ్‌ను పురస్కరించుకుని వచ్చే నెల 3,4,5 తేదీల్లో మద్యం అమ్మకాలను నిలిపివేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు.

1న దేవదాయ భూములకు వేలం పాట

మునగపాక : మునగపాక,కశింకోట మండలాల పరిధిలోని పలు దేవాదాయ శాఖకు సంబంధించిన భూములకు జూన్ 1న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో పి.సత్యనారాయణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కశింకోట మండలం వెదురుపర్తిలోని రామలింగేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి 5.01 ఎకరాలు అలాగే మునగపాక మండలం పురుషోత్తపురం, గంటవానిపాలెం, పి.ఆనందపురం గ్రామాల్లోని దేవాదాయ భూములకు సంబంధించిన 5.72 ఎకరాల భూమి వెరసి 10.73 ఎకరాల మేర వేలం పాట జరుగుతుందన్నారు. కశింకోటలోని రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జూన్ 1న ఉదయం 11 గంటలకు వేలం పాట జరుగుతుందన్నారు. మూడేళ్ల కాలపరిమితి అనగా 01-06-2024 నుంచి 31-03-2027 వరకు వేలం పాట అమలులో ఉంటుందన్నారు. పాట దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మూర్తి కోరుతున్నారు.

మెనూ మరింత రుచికరంగా..



కోటవురట్లలో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత రుచిగా అందించేందుకు చర్యలు తీసుకుందని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు అన్నారు.

మండల పరిషత్ సమావేశ మందిరంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో బుధవారం సమావేశం నిర్వహించి వంటల తయారీ, నాణ్యతపై శిక్షణ ఇచ్చారు.

మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ఏర్పాటు చేసిన మెనూ స్టాల్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విజయవాడలో వంటల తయారీపై శిక్షణ పొందిన కార్మికుల ద్వారా మరింత రుచిగా వంటలు చేసేందుకు కృషి చేయాలన్నారు. నాణ్యతలో లోపాలు లేకుండా శుభ్రమైన రుచికరమైన వంటకాలను పిల్లలకు అందించాలని సూచించారు.